# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట




పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేంద్ర బోయి

## ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు18,ప్రభాతవార్త :** పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు, గొప్ప బహుజన విప్లవకారుడు, ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మహబూబ్ నగర్ పద్మావతి కాలనీ, గ్రీన్ బెల్ట్‌లో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం దాదాపు 350 ఏండ్ల కిందనే కృషి చేసిన బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, 17వ శతాబ్దంలోనే స్వీయ సైన్యంతో దక్కన్‌పై బహుజనుల సంక్షేమ బాధ్యత తీసుకొని తొలి బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడు తొలి బహుజన రాజు అని ఆయన చెప్పారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. పాపన్న గౌడ్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా ఉండేలా ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో శంకుస్థాపన చేసుకుంటున్నామని, తెలంగాణ లో ప్రతి గ్రామ గ్రామాన ఆయన విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయన చరిత్ర భవిష్యత్ సమాజానికి తెలిసేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

..సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బడుగు బలహీనవర్గాలు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమను –మిగతా4లో..




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## సత్వరం పరిష్కరించాలి

### మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 18,ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు.

**విద్యా సంస్థలు,హాస్టళ్లు తనిఖీ చేయాలి..**

రెసిడెన్షియల్ పాఠశాలలు, కె.జి.బి.వి.లు, సంక్షేహాస్టళ్లు మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు తమకు కేటాయించిన వాటిని తనిఖీ చేసి "విద్యాఐ" అప్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ వివిధ అంశాలపై సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ లు తనిఖీ చేపట్టకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి వారికి షోకాజ్ జారీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు పి.ఎం. ఏ వై సర్వే చేసి అప్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యత గా భావించి ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రతి రోజు 10 ఇండ్లు చేయాలని, అప్పుడే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ మంజూరు అవుతుందని –మిగతా4లో..




వీసీలో పాల్గొన్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

## యూరియా సమస్య రానీయొద్దు..

- రోజువారీ నిల్వలపై పర్యవేక్షణ ఉండాలి
- అధిక ధరలకు విక్రయించే డీలర్లపై చర్యలు
- వీసీలో వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వర్‌రావు

4

## ప్రజావాణికి 40 ఫిర్యాదులు



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాట బంద్..బడి బంద్



అడవి సత్యారం బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న వరద

### జలదిగ్బంధంలో గ్రామాలు

**మాగనూర్, ఆగస్టు 18 ప్రభాత వార్త:** భారీ వర్షాలు వచ్చి వరద వస్తే చాలు మా గ్రామాలు ఇంకెన్నాళ్లు జలతిగ్బంధంలో ఉండాలని బాధిత గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో పాటు సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేయడంతో మాగనూర్ పెద్దవాగు నెరడగం,అడవి సత్యారం లో లెవెల్ బ్రిడ్జిలపై నుండి ఉదృతంగా ప్రవహిస్తుంది. మండలంలోని కొన్ని గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దీంతో ఉపాధ్యాయులు వాగు దాటలేకపోవడంతో సోమవారం నేరడగం,బైరంపల్లి, వర్క్యూర్, నేరడగం దొడ్డి, ఉజ్జలి, అడవి సత్యారం, పుంజనూర్, గజరం దొడ్డి, పెగడబండ, తాలంకేరి, గ్రామాలకు మాగనూర్ విద్యాధికారి మురళీధర్ రెడ్డి లోతట్టు ప్రాంతాల పాఠశాలలకు ఒకరోజు స్థానిక సెలవుగా ప్రకటించారు. వాగుపై హై లెవెల్ బ్రిడ్జ్ లను నిర్మించి ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

# జనజీవనం అస్తవ్యస్తం

| ఉమ్మడి జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు | |
|---|---|
| రేవల్లి | 86.2 |
| పెద్దకొత్తపల్లి | 75.6 |
| నారాయణపేట | 60.0 |
| సీసీకుంట | 59.3 |
| అయిజ | 52.2 |

- నాలుగురోజులుగా ఎడతెగని వర్షాలు
- ఉమ్మడి పాలమూరులో ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- అలుగులు పారుతున్న చెరువులు,కుంటలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు18,ప్రభాతవార్తః** ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెగని ముసురు వర్షం కురిసింది. ఉమ్మడి జిల్లాలో వనపర్తి జిల్లాలోని రేవల్లిలో అత్యధికంగా 83మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి జిల్లా వరప్రదాయిని జూరాలకు ఈ ఏడాదిలో అత్యధిక వరద నమోదు కావడంతో 30గేట్లు ఎత్తి దిగువన శ్రీశైలానికి నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కోయిల్‌సాగర్, సంగంబండ ప్రాజెక్టుల గేట్లు ఎత్తారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగులు పారుతున్నాయి. రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. నారాయణపేట జిల్లాలో జనజీవనం స్తంభించింది. జిల్లాలోని సంగంబండ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వర్షపు నీటికి చెరువులకు అలుగులు పారి గ్రామాలకు రాకపోకలు స్తంభించారు. పలు పాఠశాలలకు సెలవులను ప్రకటించారు. జిల్లాలోని కర్ని గ్రామానికి వెళ్లే దారిలో రాకపోకలు స్తంభించి పోవడంతో కలెక్టర్ సిక్తాపట్నాయక్ పరిశీలించారు. జిల్లాలో మూడు చోట్ల ఇండ్లు నేలమట్టమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం గోపన్న పల్లె వాగును కలెక్టర్ విజయేంద్ర బోయి పరిశీలించారు. వాగు ఉధృత ప్రవాహం తగ్గే వరకు దాటవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దని సూచించారు. వాగులు, చెక్ డ్యాంలు దాటే ప్రయత్నం చేయొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

4



వరద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

## కర్ని దారిలో రాకపోకలను నిలిపేయండి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశం

**నిండుకుండలా సంగంబండ గేట్లన్నీ ఎత్తివేత**

**మక్తల్ టౌన్, ఆగస్టు 18,ప్రభాతవార్త:** మక్తల్ మండలం కర్ని గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు పై పారుతున్న వరద నీటి ఉదృతి తగ్గే వరకు ప్రజల రాకపోకలను నిలిపి వేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం మక్తల్ మండలంలోని కర్ని గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టుపై పారుతున్న వరద నీటి ప్రవాహాన్ని ఆమె పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కర్నీ గ్రామానికి ఎగువ ప్రాంతంలో ఉన్న టేకుల పల్లి, రుద్ర సముద్రం, గొల్లపల్లి గ్రామాల చెరువులు నిండి అలుగు పడుతున్నాయని, ఆయా చెరువుల అలుగు నీరు కర్నీ గ్రామ కల్వర్టుపై కి చేరి మోకాళ్లలోతు వరకు ఉదృతంగా పారుతోందని, ఇలాంటి సమయంలో అటు వైపు ఉన్న గ్రామాల ప్రజలు ఇటు (మక్తల్) వైపు రావడం ప్రమాదకరమని కలెక్టర్ తెలిపారు. కల్వర్టుకు రెండు వైపుల సిబ్బందిని ఉంచి ప్రజల రాకపోకలను నిలిపి వేయాలని ఎంపీడీఓ రమేష్‌ను ఆదేశించారు. విద్యార్థులు, వృద్ధులు వాగు దాటే ప్రయత్నం చేస్తుంటారని ఎట్టి పరిస్థితుల్లో అలా జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మక్తల్ తహసిల్దార్ సతీష్ కుమార్ కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ఉన్నారు. సంఘం బండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లో కర్ణాటక పరివాహక ప్రాంతాల నుంచి ఇద్లూరు వాకి పొంగిపొర్లగడంతో సంగంబండ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండుకుండలా మారింది, నిండిన నీటినిగేట్లన్నీ ఎత్తి కిందికి వదలడం చేత పరీవాహక ప్రాంతాలు రాకపోకలకు ఇబ్బంది కలిగాయి బ్రిడ్జిపై నీరు పారడంతో రాకపోకలన్నీ నిలిచిపోయాయి.

### రహదారి దిగ్బంధం



**దేవరకద్ర, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మండలంలోని కౌకుంట్ల ఇస్రంపల్లి గ్రామాల మధ్య గల వాగులో భారీ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పలు గ్రామాల ప్రజలు రహదారిని దిగ్బంధించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉందని వాహనదారులు వాగు దాటే క్రమంలో ప్రమాదానికి గురై అవకాశం ఉందని రాకపోకలను అడ్డుకుంటున్నారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌకుంట్ల తహసిల్దార్ సుందర రాజ్, ఎంపీడీవో శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న హెచ్చరించారు.

### బూనీడు వాగు పొంగింది



**మద్దూర్, ఆగస్టు 18, ప్రభాతవార్తః** మద్దూరు మండల పరిధిలోని మద్దూర్, బూనీడ్ వాగు రావడం వలన రాకపోకలు నిలిచిపోయాయి బూనీడ్, అప్పిరెడ్డిపల్లి, చెన్వార్, ఎర్రగుంట తండా వారికి మద్దూర్ రావాలంటే కొత్తపల్లి నిర్జింత అక్కడి నుంచి రావాల్సి వస్తుందని పలువురు అంటున్నారు. గత మూడు రోజుల నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వాగులు కుంటలు ఎక్కడివి అక్కడ నిండిపోయాయని రైతులు తెలిపారు.

## యూరియా కష్టాలు మళ్లీ మొదటికి..



వర్షంలోనూ ఆత్మకూరు మార్కెట్ యార్డ్‌లో యూరియా కోసం చెప్పలను క్యూలోఉంచిన దృశ్యం

**ఆత్మకూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ప్రస్తుత కర్వ్ సీజన్ కు సంబంధించి వరి నాట్లు పూర్తయి దాదాపు నెల రోజులు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంలో ఘోరంగా విఫలమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూరు పట్టణం లోని మార్కెట్ యార్డ్ కార్యాలయంలో రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి మక్తల్ నియోజకవర్గం వాకిటి శ్రీహరి స్పష్టమైన ఆదేశాలు అధికారులకు జారీ చేస్తూ యూరియా కోసం రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేస్తామని ప్రకటించి 24 గంటలు కూడా గడవక ముందే సోమవారం మధ్యాహ్నం వర్షం కురుస్తున్నప్పటికీ పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద రైతులు యూరియా కోసం చెప్పులు క్యూ లైన్ లో పెట్టి నిరీక్షణ గావించారు. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ రామన్‌పాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆయకట్టు రైతులు వరి నాట్లు పూర్తిచేసుకున్నారు. గత 15 రోజులుగా ఆత్మకూర్ సబ్ డివిజన్ పరిధిలో కోసం రైతులు తీవ్రెక్కట్లో గురవుతున్నప్పటికీ అటు ప్రభుత్వ అధికారులు గానీ ఇటు ప్రజాప్రతినిధులు గాని ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడం ఎంతవరకు సమంజసమని కురిపిస్తున్నారు.

## ఉప్పొంగిన ఊట్కూర్ పెద్ద చెరువు

**ఊట్కూర్, ఆగస్టు 18 ప్రభాతవార్తః** ఊట్కూర్‌లోని పెద్ద చెరువు కుండపోత వర్షాలకు నిండు కుండలా మారింది. చెరువులో నీటి మట్టం గరిష్టస్థాయికి చేరి కట్టలపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. చెరువుకు వరదనీరు చేరడంతో పరిసర ప్రాంతం అందమైన రూపు సంతరించుకుంది. చెరువు పొంగిపొర్లడంతో ఊట్కూర్, సమీప గ్రామాల రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. స్థానిక అధికారులు చెరువు వద్ద పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రజలు చెరువు కట్టల వద్ద గుమికూడరాదని హెచ్చరికలు జారీ చేశారు. చెరువులో జలకళ విరాజిల్లుతున్న దృశ్యాన్ని వీక్షించేందుకు గ్రామస్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.



అలుగు పారుతున్న చెరువు

## ఎన్ని పనులైనా సరే..

# నిధులు నేను తెస్తా..

- చెరువు కట్టలను పటిష్టం చేయండి..
- పంటల నష్టంపై సమాచారం ఇవ్వండి
- మరో ఇరవై ఏళ్లపాటు ఇబ్బంది లేకుండా ప్రణాళికలు వేయండి
- అధికారులకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశం

**జడ్చర్ల,ఆగష్టు 18 ,ప్రభాతవార్త :**మరో వారంపదిరోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చెరువుల కట్టలు బలహీనపడి తెగిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే తన దృష్టికి తీసుకురావాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారుల



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

ను ఆదేశించారు. జడ్చర్ల పట్టణంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోకుండా మరో 20ఏళ్ల వరకూ సరిపోయే ప్రణాళికలు రూపొందించాలని మున్సిపల్ అధికారులను కోరారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను తనకు తక్షణం తెలియజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం తనక్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, రెవెన్యూ, మున్సిపల్, ప్రజారోగ్య శాఖలఅధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేసి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగానే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే అన్ని చెరువు కట్టల పటిష్టతను సర్వే చేసి ఎక్కడైనా చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. జడ్చర్ల పట్టణ పరిధిలో ఉన్న నల్లచెరువు, నల్లకుంట, ఊరచెరువు తదితర చెరువులకు నీళ్లు ప్రవహించే ఛానల్స్ ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీడర్ ఛానల్స్ ఆక్రమణలకు గురైన చోట వాటిని వెడల్పు చేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని, చెరువుల్లోకి నీళ్లు సాఫీగా వెళ్లిపోయేలా చూడాలన్నారు. జడ్చర్ల పట్టణంలో రహదారులపై నీల్లు నిల్వకుండా ఉండటానికి 20 ఏళ్లకు సరిపోయేలా పనులను ప్రతిపాదించాలని సూచించారు. పనులను మీరు ప్రతిపాదిస్తే అవసరమైన నిధులను తాను తీసుకొస్తానని అధికారులకు హామీ ఇచ్చారు. చెరువుల ఎఫ్టీఎల్ బఫర్‌జోన్ల పరిధిలో ఎక్కడైనా ఎవరైనా ప్లాటింగ్‌చేస్తే నిర్మొహమాటంగా వాటిని తొలగించాలని ఆదేశించారు. ఒక్క విద్యుత్ ప్రమాదం కూడా జరగకుండా చూడటం కోసం రూ.11కోట్లతో సేఫ్టీ బడ్జెట్‌ను ప్రభుత్వానికి పంపామని, ఆనిధులు త్వరగా వచ్చేలా చూడాలని అధికారులుకోరగా, ఈవిషయం గురించి తక్షణ చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి విద్యుత్ శాఖ సీఎండీని ఫోన్ లో కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే నియోజకవర్గంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ అధికారులను అనిరుధ్ ఆదేశించారు.

## పల్లెవాసులకు రక్షణ కల్పించాలి

### గోపన్నపల్లెవాగును సందర్శించిన కలెక్టర్ విజయేంద్రబోయి

**భూత్పూర్,ఆగస్టు 18,ప్రభాతవార్త :** ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పోతులమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని గోపన్నపల్లెవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పల్లెవాసులకు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి వాగు వరద ఉధృత నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. పల్లెవాసులకు ఎలాంటి ఇబ్బందులు –మిగతా4లో..



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి



**శ్రీరంగాపూర్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** శ్రీరంగపురం మండల కేంద్రంలో గౌడ సంఘం అధ్యక్షులు నర్సింగౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతిని శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న 300 సంవత్సరాల క్రితమే 12,000 మంది సైన్యాన్ని తయారు చేసుకొని రజాకర్లపై తిరుగుబాటు పోరాటం చేసి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. బహుజన రమేష్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయినటువంటి వారిని మనం స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఇలాంటి కార్యక్రమాలను ప్రతి గ్రామంలో నిర్వహించి వారిని ఆదర్శంగా తీసుకొని వారి యొక్క విగ్రహాలను కూడా ఏర్పాటు చేసుకుంటే వారి యొక్క చరిత్ర అందరికీ తెలిసే విధంగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని బహుజన రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింగౌడు, మాజీ సర్పంచ్ ఆర్.వెంకటస్వామి, బహుజన రమేష్ నీరుగంటి వెంకటేష్ గౌడ్, మధుమోహన్‌గౌడ్, మేఘనాథ్ గౌడ్, రాజు గౌడ్, పి.వెంకటేశ్వర గౌడ్, ఎల్లగౌడ్, ప్రభాకర్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** అన్యాయం, దౌర్జన్యాలకు ఎదురొడ్డి, ప్రజల హక్కుల సాధన కోసం పోరాడిన ధీశాలి సర్వాయి పాపన్న అని గోరేటి వెంకన్న పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని, హక్కుల సాధనలో పాపన్న గౌడ్ చూపిన ధైర్యం సమాజానికి మార్గదర్శకమన్నారు. క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోరటి వెంకన్న మాట్లాడుతూ సర్వాయి పాపన్న గొప్పతనాన్ని, ధీరత్వాన్ని కొనియాడారు. క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ ప్రముఖుల జయంతులను, జన్మదినలను వర్ధంతులను నిర్వహిస్తూ సమాజానికి స్ఫూర్తి నింపుతున్న క్లాస్మేట్ క్లబ్ సభ్యులను అభినందించారు. క్లాస్మేట్ క్లబ్ ఫౌండర్ అధ్యక్షులు శ్రీ వాస రాఘవేందర్ మాట్లాడుతూ ప్రముఖుల కార్యక్రమాల సందర్భంగా వీలైన ఆర్థిక సహాయ సహకారాలను పేద విద్యార్థులకు గత 2 దశాబ్దాలుగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లాస్మేట్ క్లబ్ ఫౌండర్ అధ్యక్షులు వాస రాఘవేందర్, కే రామచంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పోల శ్రీనివాసులు, వివిధ సంఘాల ప్రతినిధులు కేపి ప్రసాద్, డి.రాజయ్య, అబ్దుల్లా ఖాన్, కృష్ణమోహన్, నిరంజన్, వహీద్‌ఖాన్, కిషన్‌రావు, బి.రమేష్, వెంకటేష్, ఆర్.సత్యం మరియు కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జడ్చర్ల, ఆగస్టు18,ప్రభాతార్త:** జడ్చర్లలోని గౌడ ఫంక్షన్ హాల్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య, పీఏసీసీఎస్ చైర్మన్ సుదర్శన్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు ఉమా శంకర్ గౌడ్, చైతన్యగౌడ్, బీజేపీ నియోజకవర్గ నాయకుడు ఎడ్ల బాలవర్ధాన్ గౌడ్, కృష్ణ యాదవ్, ఇంతియాజ్ ఖాన్, ఎడ్ల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

**మద్దూర్ ఆగస్టు 18 ప్రభాతవార్త:** మద్దూరు మున్సిపాలిటీ పట్టణం కేంద్రంలో పాత బస్టాండ్, రాజీవ్ గాంధీ చౌరస్తాలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మొగల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలోగౌడ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**ధన్వాడ, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ధన్వాడలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక రాజకీయ సమానత్వం కోసం పోరాడిన యోధుడు స్వర్గీయ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జట్రం గోవర్ధన్ గౌడ్, టైలర్ శ్రీనివాస్ గౌడ్, జట్ల రాఘవేందర్ గౌడ్, గౌడ సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

## బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారమే పాపన్నగౌడ్ ఆశయం

■జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



**రాజాపూర్ ఆగస్టు 18, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం రావాలన్న ఆశయంతోనే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆనాడు పోరాటం చేశాడని, ఆ పోరాటం మనందరికీ స్ఫూర్తిగా నిలవాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా రాజాపూర్ మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. 370 సంవత్సరాల క్రితమే బడుగు బలహీన వర్గాల బిడ్డ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం చేసి రాజ్యాధికారం సాధించాడని, ఆయన బాటలో నడవాలని కోరారు. కేవలం 12 మంది సహాయకులతో ప్రారంభమై, వేల మంది సైన్యాన్ని తయారు చేసుకొని, ఆయుధ సంపత్తితో గోల్కొండ కోటతో పాటు, తెలంగాణ ప్రాంతంలోని 32 కోటలను జయించి, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన భారత దేశపు తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్, మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటలు నీటి సరఫరా నిలిపివేత

**నారాయణ పేట, ఆగస్టు 18 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని 258 గ్రామాలకు అనగా నేటి ఉదయం 8:00 గంటల నుండి బుధవారం ఉదయం 8:00 గంటల వరకు మొత్తం 24 గంటలు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుంది అన్ని ఎందుకు అనగా రాంరెడ్డి గూడెం డబ్లు టీ పి ట్యాపింగ్ దగ్గర వాల్వ్ రిపేర్ చేయడం మరియు క్రిస్టియన్ పల్లీ దగ్గర 1200ఎంఎం పైపులైన్ ఎన్ హెచ్ రోడ్డు విస్తరణ లో భాగంగా మార్చడం జరుగుతుందన్నారు. పనులు పూర్తయ్యే వరకు 24 గంటలు నీటి సరఫరా ఆపివేస్తామన్నారు. మరమ్మత్తుల కారణంగా మహబూబ్ నగర్ పురపాలకకు పాక్షికంగా, మన్యంకొండ నీటి శుద్ధకరణ ప్లాంట్ నుండి వెల్లె నారాయణపేట, మక్తల్ మరియు పురపాలకలుకి పూర్తిగా నీటి సరఫరాలో అంతరాయము కలుగును. కావున ప్రజలందరూ సహకరించాలని తెలియజేశారు

## మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డికి ఘన నివాళి



**మక్తల్ టౌన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మక్తల్ మాజీ శాసనసభ్యులు కొత్తకోట దయాకర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు కొత్తకోట సిద్ధార్థరెడ్డి అభిమానులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు నాయకులు మక్తల్ పడమటి అంజనేయ స్వామి ఆలయములు పూజలు నిర్వహించారు. కే.సిద్ధార్థ రెడ్డి వారి తండ్రి జ్ఞాపకార్థం అంబేద్కర్ నగర్ మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల బృందం విద్యార్థుల కోరిక మేరకు ఆ పాఠశాలకు 30ఫ్యాన్లు 30ట్యూబ్ లైట్స్ అందజేశారు. తదుపరి ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం కొత్తకోట దయాకర్ రెడ్డి అభిమానులు కార్యకర్తలు, నాయకులు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ వాడ్వట్, బలరాం రెడ్డి, సిద్ధార్థ రెడ్డి, రాకేష్, శ్రీనివాస్ రెడ్డి, కురుమయ్య గౌడ్, చెన్నయ్య గౌడ్, ఆంజనేయులు గౌడ్, మోహన్‌రెడ్డి, గుర్లపల్లి శేఖర్ రెడ్డి, ఎల్లగౌడ్, నరసింహారెడ్డి, గుండప్ప, నరేందర్ రెడ్డి సంగంబండ, లక్ష్మీనారాయణ గౌడ్, సద్దాం హుస్సేన్, బాల్‌రెడ్డి జక్లేర్, బాల్‌రెడ్డి మక్తల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**నర్వ ఆగస్టు 18, ప్రభాతవార్త:** నర్వ మండల కేంద్రంలోని రామాలయం దగ్గరున్న ఎన్ టి ఆర్ విగ్రహం వద్ద సోమవారం మక్తల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొత్తకోట దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకడ్మూర్ నాయకులు పోలీస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వ ర్యంలో ఇతర అభిమాన నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి అభిమానులు శ్రీనివాస రావు, వెంకట్ రాంరెడ్డి, ఆంజనేయులు, నర్సింహా, మల్లేష్ యాదవ్, రాజు, గుడిసె వెంకటయ్య, అయ్యన్న, లక్కర్ దొడ్డి వెంకటయ్య, వెంకప్ప, నర్సింహా రెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముని విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

◆ గాంధీ విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి

◆ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ

**కల్వకుర్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వెంటనే మహాత్మా గాంధీ విగ్రహం అక్కడే ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బచ్చురామకృష్ణ, వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ జూలూరు రమేష్‌బాబులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట పట్టణంలోని వాసవి మాత దేవాలయంలో సమావేశమై అక్కడి నుండి బైక్ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ బానిసత్వంలో మగ్గుతున్న దేశ పౌరులకు స్వేచ్ఛ వాయువులు అందించేందుకు స్వాతంత్ర పోరాటం నిర్వహించి దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అన్నారు. అందరి కోసం పనిచేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణం అన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి అన్నారు. జూలూరి రమేష్ బాబు మాట్లాడుతూ మహాత్మాగాంధీ విగ్రహ ధ్వంసం బాధాకరమన్నారు. ప్రభుత్వం అక్టోబర్ 2వ తేదీ వరకు విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జనార్దన్ రెడ్డికి ఆర్యవైశ్య మహాసభ నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా



మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ

దోషులను కఠినంగా శిక్షించాలని, విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణ సంఘం అధ్యక్షుడు వాసా శేఖర్, మండల శాఖ అధ్యక్షుడు గంధం ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహాసభ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గంప శీను, అదనపు కార్యదర్శిచిగుళ్ల పల్లి శ్రీధర్, ప్రచార కార్యదర్శి రాజయ్య, వెల్దండ శాఖ అధ్యక్షుడు ఉప్పు ఆంజనేయులు, వంగూరు శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి సురేష్, చారకొండ కార్యదర్శి పరమేష్, వాసవి క్లబ్ అధ్యక్షుడు బాదం రాఘవేందర్, వాసవి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు దాచేపల్లి మనోహర్, ఆర్యవైశ్య మహాసభ పట్టణ కార్యదర్శి సంబు ముత్యాలు, కోశాధికారి జూలూరు వీరేష్, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండూరు కృష్ణయ్య, నాయకులు గందెరవి, పాపిశెట్టి వెంకటేశ్వర్లు, కంది ప్రవీణ్, చిట్టిఅశోక్, నారాయణరాజు, గుబ్బకిషన్, కల్వ ఆంజనేయులు, సంబు తరుణ్, అప్పాయిపల్లి శ్రీనివాస్, ఆకుతోట రవికుమార్, గోవింద శ్రీనివాస్, సామల నరసింహ, జూలూరు ప్రకాష్‌తో పాటు రైస్ మిల్లర్స్ అసోసియేషన్, కిరాణం అసోసియేషన్, డిగార్డిగేటర్స్ అసోసియేషన్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆందోళనకు మద్దతుగా మహాత్మా గాంధీ విగ్రహ ధ్వంసంపై ఆర్యవైశ్య పట్టణ, మండల, డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనకు కాంగ్రెస్, బిజెపి నాయకులు మద్దతు ప్రకటించి ఆర్డీఓ కార్యాలయం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మహాత్మా గాంధీ విగ్రహం అక్కడే ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, రేష్మా బేగం, బిజెపి పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్, జిల్లా నాయకులు రవిగౌడ్, శేఖర్‌రెడ్డి, కృష్ణగౌడ్ తదితరులు మద్దతు ప్రకటించడంతో పాటు విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## కార్యకర్తలే ‘పార్టీకి’ నాయకులకు బలం

- పార్టీకి మేము ఉన్నామనే ధైర్యం ఇవ్వడం మా అదృష్టం
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారు : వంగూరు బిఆర్ఎస్ కార్యకర్తలు



బావోద్వేగంతో కన్నీరు పెడుతున్న బిఆర్ఎస్ కార్యకర్త మందా రాజేందర్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వంగూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త:** 15 సంవత్సరాలుగా మీతో కలిసి తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన మీజాతి బిడ్డలకు 10 సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా న్యాయం చేయలేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నాతో పాటు బిజెపి పార్టీలోకి వస్తారా రారా అంటూ ఫోన్ చేసి బెదిరిస్తే భయపడే ఆలోచన లేదని... మేము తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీలోనే ఉంటామని కార్యకర్తలు నిర్మొహమాటంగానే వివరించారు. కార్యకర్తలకు విషయం చెప్పకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకొని బిజెపి పార్టీలో చేరి తనను నమ్ముకున్న కార్యకర్తలకు నాయకులకు నమ్మకద్రోహం చేశారని, మరోసారి తన వెంట వెళ్లి మోసపోవడానికి సిద్ధంగా లేమని బహిర్గాటంగానే చెప్పుకొస్తున్నారు కార్యకర్తలు. కార్యకర్తల నిర్ణయం తీసుకోకుండా పార్టీ ఫిరాయింపుపై ఉద్యమ నాయకుడు మంద రాజేందర్ రెడ్డి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టి ప్రసంగించారు. సీఎంసొంత మండలంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని, గువ్వలపై విమర్శలు కాదు పార్టీ మారినందుకు బాధాకరమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఒక్కరే లేరు...స్థానిక ఎన్నికలు అయిపోయిన తరువాత పోయిన ఇబ్బంది ఉండేది కాదని, ప్రజల మధ్యలో ఎంత గొప్పగా ఉన్న ప్రజల పక్షాన నిలబడితే నీ పేరు చిరస్థాయిగా ఉంటదని అన్నారు. అధికారం కోసం ప్రజలను మోసం చేసి, కాళేశ్వరం మీద కేసీఆర్‌ని విమర్శించడం తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వేరే పని లేదని అన్నారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేసి సాగు నీరు అందిస్తే ప్రజల మధ్యలో ఉంటావన్నారు. ప్రజల్లో ఇప్పటికి కేసీఆరే ముఖ్యమంత్రిగా గుర్తుకువస్తున్నారని పేర్కొన్నారు. పెన్షన్, నీళ్లు, రుణమాఫీ, ఇచ్చిన కేసీఆర్‌ని ఆనవాళ్లు లేకుండా చేయడం నీ తరం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 3నెలలకే వ్యతిరేకత తెచ్చుకున్నారని దుయ్యబట్టారు. ప్రజలను మభ్యపెట్టడానికి ఎన్నో జిమ్మిక్కులు వేస్తున్నారని, ఎకరాకు రూ.15వేలు, తులం బంగారం, పెన్షన్ ఇస్తారని ఓట్లు వేస్తే ఒక్కటన్నా ఇచ్చారా అని ప్రశ్నించారు. వంగూరు మండల కేంద్రంలో రాయల్ ఫంక్షన్ హాల్‌లో మండల బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచ్చంపేట బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, కల్వకుర్తి మాజీ శాసన సభ్యులు జైపాల్‌యాదవ్‌లు హాజరయ్యారు.

**ప్రజలను అప్రమత్తం చేయాలి: వంగూరు మండల బీఆర్ఎస్ నేతలు**

కాంగ్రెస్ కార్యకర్తలలోనే వ్యతిరేకత ఉందని, ఆ వ్యతిరేకతను ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని వంగూరు మండలంలో గులాబీ జెండాను ఎగురవేయాలన్నారు. మాయమాటలు నమ్మి మోసపోయాం.. మరోసారి మోసపోవద్దని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్ రాకుండా చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ కోసం ఎవరిని నిలబెట్టిన ఎన్నికల్లో గెలిపించాలని, ఇప్పుడు మారకపోతే తెలంగాణ లో మన ఉనికి కోల్పోతామని, యూరియా కోసం రైతులు చెప్పులు లైన్‌లో పెట్టె పరిస్థితిని తీసుకొచ్చారాని ఆవేదన వ్యక్తం చేశారు. 420హామీలు, 6 గ్యారంటీలు అమలు కావాలంటే బిఆర్ఎస్ గెలువాలని, 2 సంవత్సరాలు పార్టీ గెలుపుకోసం పని చేస్తే రానున్న కాలం మనకోసమే ఉందని అన్నారు.

**స్థానిక ఎన్నికల్లో గులాబి జెండా ఎగురవేద్దాం**

**- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి**



రాబోయే రోజుల్లో వంగూరు మండలాల్లో, గ్రామాల్లో పార్టీ నాయకులను, కార్యకర్తలను కలిసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేస్తానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వంగూరు మండలాల్లోని ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురేద్దామని ఆయన పిలుపునిచ్చారు. పార్టీలో వ్యక్తులు వస్తుంటారు... పోతుంటారు.. పార్టీలు మాత్రం శాశ్వతంగా ఉంటాయన్నారు. పార్టీని కాపాడే శక్తి కార్యకర్తలకు మాత్రమే ఉంటుందని, తెలంగాణ రాష్ట్రంలో అచ్చంపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఒక బలమైన సంకేతమిచ్చారన్నారు. అందరూ సమన్వయంతో ఉండి, ప్రలోభాలకు భయపడకుండా పార్టీ కోసం నిబద్ధతో పని చేసినవారికి పార్టీలోమంచి గుర్తింపు ఉంటుందన్నారు. వంగూరు మండలం ముఖ్యమంత్రి స్వంత మండలం కాబట్టి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను వేధింపులకుగురిచేసే అవకాశం ఉందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వంగూరు మండలంలో అందరం సమిష్టిగా పని చేసి జెడ్పిటిసి, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకుందామన్నారు. ఈ రోజు నుండి అచ్చంపేట నియోజకవర్గంలో అన్ని మండలాల వారీగా పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి కార్యకర్తలకు భరోసా కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు 20 నెలలు అవు తుందని, అధికారంలోకి రావడం కోసం అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజాపాలనపేరుతో ప్రజలను మోసం చేస్తు న్నారని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలను, 420 హామీలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళ్ళాలని, రాబోయే రోజుల్లో మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ని తెలంగాణ రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

**తమ్ముళ్లు భయపడొద్దు... భవిష్యత్తు మనదే....**

**-కార్యకర్త లేకపోతే ఏ పార్టీ ఉండదు : మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

కేసీఆర్ నాయకత్వంలో మన తెలంగాణ రాష్ట్రంలో కార్యకర్తలకు కొదవలేదు. మనకు 60 లక్షల సైన్యము ఉంది. ఏ పార్టీ అయినా ఒక నాయకుడు, ఒక కార్యకర్తతో ముందుకు పోదు.. కేసీఆర్ కారణ జన్ముడు.. భవిష్యత్తులో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతాడు. కేసీఆర్ చేసిన అభివృద్ధి ఏ రాష్ట్రం కూడా చేయలేదు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన వ్యక్తి, రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించి రైతు పక్షపతి అయ్యారు. ప్రభుత్వ పరిపాలన అస్తవ్యస్తంగా ఒక దుర్మార్గపు పరిపాలన ఒక రాక్షస పరిపాలన ఒక ప్రజాస్వామిక పరిపాలన ఈ విధంగా కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుంది. యుద్ధంలో సైనికుల మాదిరిగా మాన కార్యకర్తలు ముందుకు పోవాలి. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులను గెలిపిస్తే గువ్వలకు మతి భ్రమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండలాల నాయకులు పోకల మనోహర్, నరసింహాగౌడ్, పర్వతాలు, నరేందర్‌రావు, గణేష్ రావు, మందా రాజేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీపతిరావు, వెంకటేశ్వరరావు, సత్యందేవా, అంజి, నరసింహారెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

■కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల ఆగస్టు18, ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నతమైన చదువుని చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నే మెరుగైన విద్య అని టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెస్ బోర్డులను పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాలమూరు ఎన్నారై పోరం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెస్ బోర్డ్స్ ఎన్ఆర్ఐ శేఖర్ చల్లాతో కలిసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న వారికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం జరిగిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పంపిణీ



ఎమ్మెల్యే వంశీకృష్ణను సన్మానిస్తున్న పీఎం శ్రీ ఉపాధ్యాయులు

కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ఎంపిడిఓ మోహన్‌లాల్, మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్, ఆ పాఠశాల హెచ్ఎం నీలం శ్రీధర్, సింగిల్ విండో డైరెక్టర్ ఆలూరి శ్రీనివాసులు, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ, పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలి

■ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని పంపించవద్దని, ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులే స్వయంగా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు, ఫిర్యాదుదారుల సమస్యలపై వెంటనే స్పందించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్‌లు పి.అమరేందర్, దేవ సహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. 30 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఎంతో కీలకంగా భావించే ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పని



సరిగా హాజరై ప్రజల సమస్యలు తీర్చేందుకు ముందు వరుసలో ఉండాలన్నారు. ప్రతి సోమవారం ఉదయం10.30 నుండి మధ్యాహ్నం1.30, గంటల వరకు ప్రజావాణిలో తప్పక ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లోపెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎవరికైనా అత్యవసరమైన పని ఉంటే, ముందుగానే తమ దృష్టికి తీసుకొనిరావాలని సూచించారు. తమ అనుమతి లేకుండా ప్రజావాణికి గైర్హాజర్ అయితే కఠిన చర్యలు తీసుకుంటా మని అన్నారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పాముకాటుతో కాడెద్దు మృతి

**దామరగిద్ద ఆగస్టు18 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని మద్దెల్ బీడ్ గ్రామంలో ఆదివారం రైతు మాధవరెడ్డికి చెందిన కాడెద్దును ఎప్పటిలాగా తన వ్యవసాయ పొలంలో మేతకు వదలడంతో పాము కాటుకు గురై మృతి చెందిందని రైతు కన్నీరు పెట్టుకున్నారు.

## కంప చెట్లను తొలగించాలి

**దామరగిద్ద, ఆగస్టు 18, ప్రభాతవార్త:** దామరగిద్ద నుండి గడిమున్కన్‌పల్లి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగించాలని కోరుకుంటున్నాం. ముండ్ల చెట్లు రోడ్డు మీదకు వచ్చినందువలన వాహనదారులకు ఇబ్బందిగా ఉంది రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కావున రోడ్డుకి ఇరువైపులా చెట్లను తొలగించాలని అధికారులను జి.మల్లికార్జున్ బికెఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మరియు బి కె ఎస్ గత్ప అధ్యక్షులు బి నర్సప్ప, దామరగిద్ద మల్లప్ప, కోరుతున్నారు.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**బిజినేపల్లి ఆగస్టు 18, ప్రభాతవార్త:** నంది వడ్డెమాన్ గ్రామంలో ఎన్ఆర్ఐలు తిప్పిరెడ్డి రామచంద్రారెడ్డి నిరంజనీదేవి దంపతుల సహకారంతో శంకర నేత్రాలయ మొబైల్ కంటి వైద్యశాల చెన్నై వారిచే నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు తమ కంటి చూపుకు సంబంధించి పరీక్షలు నిర్వహించుకుని వైద్యుల సలహాలు తీసుకున్నారు. ఈనెల 11వ తేదీ నుండి ఆదివారం వరకు 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 53 మందికి కంటిపొర ఉన్నవారికి అక్కడే ఉచితంగా కంటిపొర చికిత్సలు నిర్వహించినట్లు వైద్యులు జి.రాజయ్య తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల వారు సైతం ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిప్పిరెడ్డి సుధాకర్ రెడ్డి శెట్టి జగత్ చంద్రయ్య, న్యాయవాది వీరశేఖరాచారి, శంకర నేత్రాలయ కంటి వైద్యశాల వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

**డాక్యుమెంట్లు పోయినవి**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడ మేమనగా నా క్లైంటులు అన్వార్ వెంకటేష్ మరియు అన్వార్ అశోక్ తండ్రి అన్వార్ లక్ష్మయ్య ఆర్వో ఇంటి నెంబర్ : 2-1-49బ్రాహ్మన్ వాడి కాలనీ నారాయణపేట గార్ల షాప్ (డోర్ నం. 4-8-67 ) షాప్ యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ (1324/1985 మరియు 1298/1985)లు , వారి ఇంటి మరమ్మత్తులు చేస్తున్న సమయంలో పోయినవి. కావున ఎవరికైనా దొరికితే క్రింది నా అడ్రస్ కు తెలియజేయగలరు. జి.రఘువీర్ అడ్వకేట్ , హౌస్ నెంబర్ 4754 (మాతృ కృప), గోపాల్ పేట్ వీధి, నారాయణపేట్ పట్టణం, జిల్లా పిన్ కోడ్ : 509210, సెల్ 9440835594

